# మూగవోయిన నైటింగ్‌గేల్

ఆ సాయంత్రం...

కాలేజీముందు అతిపెద్ద బ్యానర్. శ్రీ కాసుగంటి నారాయణరావ్ ప్రభుత్వ కళాశాల ఆరవ వార్షికోత్సవం.... అని.

గుంపు గుంపులుగా అబ్బాయిలు....అందమైన చీరల్లో అమ్మాయిలు. ఆధునికంగా అలంకరించబడిన స్టేజి. రంగు రంగుల బల్బులు. ఛీఫ్‌గెస్ట్‌గా రావలసిన మంత్రిగారింకా రాలేదు. అల్లరి ఎక్కువవుతుంటే తెలుగు లెక్చరర్ మైకు ముందుకొచ్చి.... "ఎవరైనా పాట పాడగలరా?" అన్నాడు. లేడీసంతా సుప్రియా... సుప్రియా... సుప్రియా అంటూ అరిచారు. అబ్బాయిలు ఉత్సాహంగా ఎవరీ సుప్రియ అంటూ చూస్తుండగానే.... అందమైన ఒక అమ్మాయి డయాస్ పైకొచ్చింది.

ఆమె సుప్రియ...

స్టేజిమీది రంగు రంగుల కాంతుల్లో కట్టుకున్న ఎరుపురంగు చీర మెరుస్తోంది. మవుత్ పీస్‌ని ఎడ్జస్ట్‌చేసుకొని ఒక్కసారి తలెత్తి ఆడియన్స్ వైపు చూసింది.

ఎందరెందరో...

లైటు వెలుగులో ముక్కుపుడక తళుక్కుమంది. ప్రక్క పిన్నీసు మెరుస్తూ నల్లని కురుల్లో వెలుగురేఖ గీసినట్టుంది. ఎర్రని పెదాలని నాలు

క్తతో ఓసారి తడిపి గొంతు సరిచేసుకుంది. ఆమెను చూసినప్పటికీ... పాటలు పాడుతుందని అబ్బాయిల్లో ఎవరికీ తెలీదు.

క్షణాల్లో నిశ్శబ్దం పేరుకుంది.

ముందు మాట్లాడింది వేణుపూదీనట్లు....

"నేడు దాశరథిగారు లేరు, కాని ఆయన పాటలున్నాయి. గుండె ల్లోని తడిని తాకిచూసే పాటలు రాసారాయన. ఆ మహాకవి రాసినపాట పాడాలనుంది. దయచేసి ఈలలు వేయకండి.

అంతా మౌనంగా ఉండిపోయారు !

"నీకేలా ఇంత నిరాశా.... నీ కన్నులలో కన్నీరేల... అంతా దేవునిలీల...."

ఆమె పాడుతోంది.

ఆమనికోయిల ఆర్తిగా కూసినట్టు...

గూడు చెదిరిన గోరింకకు చిలుక ముద్దు పలుకులు చెప్తున్నట్టు....

"నీ మదిలోని వేదనలన్నీ నిలువవులే కలకాలం. వాడిన మోడు పూయకమానదు. వచ్చును వసంతకాలం"

పాట పూర్తిచేసింది. అచ్చు సుశీలలాగే పాడింది.

చప్పట్లు... ఈలలు.... వన్స్‌మోర్‌లు... ప్లీజ్‌లు.... అయినా అవేమీ పట్టించుకోకుండా సుప్రియ స్టేజి దిగివచ్చింది. ఫ్రెండ్స్‌తోపాటు జెంట్స్‌కూడా అభినందనల వర్షం కురిపించారు. ప్రిన్సిపాల్ 'బాగా పాడా వమ్మా' అన్నాడు.

అంతలో కారు హారన్ విన్పించటం.... అంతా హడావుడిగా పరు గెత్తడం జరిగింది.

ఛీఫ్‌గెస్ట్‌గారి రాకతో ఫంక్షన్ యధావిధిగా జరిగిపోయింది. తెల్ల వారి కాలేజీకి సెలవు. మరుసటిరోజు యధాలాపంగా కాలేజీలోకి అడుగు పెట్టింది సుప్రియ. అబ్బాయిలంతా ఆమెనే పరిశీలిస్తున్నారు.

లెటరుబాక్స్‌లో తన పేరున వున్న గులాబీరంగు కవరునొకదాన్ని

ఫ్రెండ్ నీరజ తెచ్చివ్వగానే ముందు ఆశ్చర్యపోయింది. వెయిటింగ్ రూమ్‌లో ఏకాంతంగా ఓ మూలన కూచొని లెటర్ విప్పింది.

ముత్యాలు పొదిగినట్టు అక్షరాలు.

డియర్ నైటింగ్‌గేల్ !

మీ గొంతులో గూడుకట్టుకొన్న కోయిలకి నేను ప్రేమగా పెట్టుకున్న పేరు నైటింగ్‌గేల్. బావుందా? కంఠనాళాలతోనే వీణను శృతి చేసినట్టు వీనసొంపుగా రాగం మనసుపొరల్లో గాయం చేసింది. ఆ గాయం నించి అనుక్షణం మీ గేయం స్రవిస్తోంది.

'నీతో కలిసి నీడగనడిచే తోడుగ నేనున్నాను' అన్న చరణం పాడినప్పుడు మీ చేయి పట్టుకొని నడవాలన్నంత ఉద్వేగం...

మీ పాటకు నా హృదయ కవాటాలు కొట్టుకున్న శబ్దాలు.... చప్పట్లకంటె వెయ్యిరెట్లు ప్రతిధ్వనించాయి.

గొంతులో పలికించిన విషాదానికి నాకళ్ళల్లో చేరుకున్న నీటిపొరని చూపుడు వేలికొనతో తీసి మీ తలమీద అక్షింతలుగా వేయాలని విసిరాను.

శకలమై రాలిపోయిందో... శలభమై మీ చుట్టూ తిరుగుతుందో తెలీదు. కాని మనసు మరోగ్రహమై మీ జ్ఞాపకాల చుట్టూ పరితపిస్తోంది. ఇంతకీ వీడెవడా అని ఆలోచిస్తున్నారా... మీ అభిమానిని !! నా ముద్దుపేరు టింకు! ఇదే కాలేజీలో చదువుతున్నాను. నా పేరునుబట్టి నన్ను మీరు గుర్తించగలరా? చూద్దాం !! అన్నట్టు అసలు విషయమే మర్చిపోయాను.

ఎల్లుండి ఘంటసాలగారి వర్ధంతికదా.... మన వూర్లో కళాస్రవంతి వారు రాష్ట్రస్థాయి పాటలపోటీలు పెట్టిన విషయం మీకు తెలీదని నిన్ననే వాళ్ళ లిస్టు చూసాక తెలిసింది. అందులో మీపేరు లేదుకదా! మీరు సుశీల గారి పాటలు పాడొచ్చు. ఆఖరుతేదీ నిన్ననే కాబట్టి మీ పేరున నేనే నలభై రూపాయల ఎంట్రీఫీ కట్టాను. మన్నించండి.

ఎవరీ అనామకుడు? ఎంత దుస్సాహసం అనుకుంటున్నారా? లేదు.

మీరు గొప్పగా పాడగలరు. ఎల్లుండి కళాస్రవంతిలో మీ గొంతు మంజీర నాదాలు పలికిస్తే గోల్డ్‌మెడల్ ఎగిరొచ్చి మీమెడను అలంకరించాలి నేస్తం! మీరలా పాడాలి. పాడతారుకూడా!! ఆ శ్రోతల్లోనే నేనుంటాను. సరే.... పాటమీద ఒక ప్రశ్నవేయనా? 'శంకరాభరణం' సిన్మాలో సోమయాజులు ఒకపాటమీద 'శారదా' అని అరుస్తాడు. ఎందుకో చెప్పండి....

—టింకు.

నరనరాల్లో ఉద్వేగం ప్రవహించగా... అజ్ఞాతనేస్తం పంపిన కవితాత్మక ఉత్తరానికి ఒళ్ళు పులకరించి...గుండె స్పందించి కనుకొనుకుల్లో నీటి బిందువులు నురగలు కక్కాయి. కన్నవాళ్ళు కూడా ఇవ్వని ప్రోత్సాహం అది!!

ఎవరీ నేస్తం? సుప్రియలో టెన్షన్. అస్పష్టంగా థాంక్యూ ఫ్రెండ్ అంది. మరోసారి చదివింది ఉత్తరాన్ని. కంఠంలోకి వసంతం ఎగిరొచ్చింది. రక్తం పొంగులెత్తింది. గొంతులో కోయిల నృత్యం చేసింది. ఎవ్వరూ అడక్కుండానే అదే వెయిటింగ్ రూమ్‌లో "తందనాన అహి తందనాన హరే... బ్రహ్మమొక్కటే...." అన్నమాచార్య కీర్తనని అద్భుతంగా పాడింది. ఫ్రెండ్స్ అంతా విస్తుపోయారు.

"ఏమేవ్.... ఇన్నాళ్ళూ నీ కళ బాత్రూంలోనే అనుకున్నాం. ఈ ధైర్యం ఎప్పటినించే తల్లీ" అన్నారు ఫ్రెండ్సంతా.

సుప్రియ మాత్రం అదే ఆలోచనలో వుంది.

టింకూ అంటే... ముద్దుగా బొద్దుగా వుంటాడేమో? లేక అల్లరి చేస్తుంటాడేమో ?? అనుకొని మరుసటి రోజు కాలేజీలో చాలామందిని నిశితంగా చూసింది. నిజమే ! పాటలు పాడేటపుడు పాడేవారికి సంగీత జ్ఞానం తప్పనిసరి! శంకరాభరణం సినిమాలో రాజ్యలక్ష్మి పాడేటపుడు సోమయాజులు ఎందుకలా 'శారదా' అని అరుస్తాడో తనకు తెలీదు. అసలు ఆలోచించనేలేదు' అనుకుంది సుప్రియ.

రెండోరోజు లెటర్‌బాక్స్ దగ్గరికెళ్ళేసరికి అదే రంగు కవరు...

ఆమె పేరున.

ఒక సంతోష కెరటం ఉవ్వెత్తున లేచింది. ఏకాంతంగా కవరుని ఆనందంగా విప్పింది.

"డియర్ నైటింగేల్ ...

సాధన చేస్తున్నారా.... ఈ చలి ఉదయంలో చన్నీళ్ళ మధ్య నిలిచి రాగాలాపన చెయ్యండి. ఏకాగ్రత చెడకుండా వుంటే కంఠనాళాలు వీణ తీగలవుతాయి.

సముద్రానికెదురుగా నిల్చొని తరంగాల చలనాన్ని బట్టి గొంతు స్థాయిని తగ్గిస్తూ.... పెంచుతూ రోజూ రెండు గంటలు చేయండి. మరో జానకి.... మీ గొంతులో పురుడు పోసుకుంటారు.

అందరికీ ప్రాణాలు గుండెల్లో వుంటే... గాయకుల జీవాత్మ కంఠంలో వుంటుందట. రేపు మీరు కళా స్రవంతిలో పాడుతున్నారు. అన్నట్లు నేవేసిన సినిమా ప్రశ్నకు జవాబు దొరికిందా? "సామజవరగమనా" పాటని రాజ్యలక్ష్మి పాడుతూ తన ప్రియుణ్ని గుర్తుచేసుకుంటుంది. అక్కడ ఒకరాగాన్ని విడిచి మరో రాగాన్ని పాడుతుంది. సంగీత జ్ఞానం వున్నవాళ్ళకు అదెంతమాత్రం ఏర్పడదు. కాని సంగీతాన్ని పవిత్ర తపస్సుగా భావించే శంకరశాస్త్రి (సోమయాజులు) శారదా అని గర్జించి.... రిషభం లోకి శుద్ధహిందోళం ఎలా వచ్చింది అని ప్రశ్నిస్తాడు. అదీ సంగతి!!

మీ గొంతు వినిపించే రాగాలాపన కోసమే నాకు బ్రతుకు మీద ఆశ పుడుతోంది.

టింకు—

నిజానికదీ చదివి ఆమె గొంతుకు పెగల్లేదు. అనిర్వచనీయమయిన అనుభూతి ఏదో శరీరమంతా ప్రాకింది.

ఎవరితను ?

తన కోసం ఎంట్రీ ఫీ కట్టి... ఇంత బాగా ప్రోత్సహించేది.

అజ్ఞాతంలో ఉండడమెందుకు??

వందలమంది విద్యార్థుల్లో ఎవరిని గుర్తించను? ముద్దుపేరుచెప్పాడు గాని అసలు పేరు చెప్పలేదే?

"ఐ లైక్ యూ టింకూ" అనుకుంది ఉత్తరాన్ని గుండెలకు హత్తుకుంటూ...

* * *

"కొండలలో నెలకొన్న కోనేటిరాయడువాడు
కొండలంత వరములు గుప్పెడు వాడు..."

ఆమె పాటతో హాలు దద్దరిల్లింది. ముఖ్యంగా పాట చివరి సంగీతానికి... హేట్సాఫ్, హేట్సాఫ్ అంటూ పావుగంటసేపు లయబద్ధంగా చప్పట్లు చరిచారు ఆడియన్స్.

ఆ చప్పట్లు.... ఒక కళాకారున్ని జీవితకాలం బ్రతికించగలవేమో?

హాలు మధ్యలో ధామ్మని టపాకాయ ప్రేలింది. అంతా సర్దుమణిగే సరికి అరగంట పట్టింది. ఆ లోపునే... దెబ్బయిమంది పాల్గొన్న ఆ పోటీలో ఆమెకే బహుమతి ప్రకటించారు న్యాయనిర్ణేతలు.

ఈలలు.... కూతలు... వన్స్‌మోర్‌లు.... మరోసారి పేట్రేగిపోయాయి.

సుప్రియ గోల్డ్ మెడల్ అందుకుంటూ ఆడియన్స్ వైపు చూసింది కళ్ళనీళ్ళతో.... అతడు కన్పించలేదు.

ఎవరని గుర్తించగలను? ఎలా గుర్తించగలను??

కన్నవాళ్ళు... స్నేహితురాళ్ళు ఎవ్వరూ ఇవ్వని మనోబలాన్ని అతడిచ్చాడు. అతడు ఎదురుగావస్తే మెడల్ అతని మెడలో వేసి పాదాభివందనం చెయ్యాలన్నంత ఉద్వేగం...

హిమాలయాల మీద నిల్చున్నట్టు... తృప్తిగా బంగారు పతకాన్ని చూసుకుంది. అతన్ని చూడాలనే ధృఢమైన నిశ్చయం... మేకప్ రూమ్‌లో గంటసేపు కూచుంది.

సుప్రియ సాధించిన విజయం కాలేజీలో గుప్పుమంది. ప్రిన్సిపాల్

క్లాస్‌రూంలోకి వచ్చి ప్రత్యేకంగా అభినందించాడు. లెక్చరర్లు, స్నేహితు రాళ్ళు, అబ్బాయిలు అభినందనల తుఫాన్‌ని చూపించారు.

ఉక్కిరిబిక్కిరి అయింది సుప్రియ. అయినా టింకూనే పలవరిస్తోంది మనసు. ఇన్నింటికి మూలకారణమైన అతన్ని గుండెలకు హత్తుకోవాలని పించింది.

ఒక్కసారి అతడొచ్చి కంఠం మీద ముద్దులు కురిపిస్తే బావుండు ననిపించింది. స్వీటు, టీ పార్టీలయ్యాక సాయంత్రం కాగానే ఫ్రెండ్స్‌తో ఇంటికి బయల్దేరింది సుప్రియ. అంతా పన్నెండుమంది కల్సి గ్రౌండు లోంచి నడుస్తున్నారు నత్తనడకలతో.

జోక్స్ ప్రేలుతున్నాయి. నవ్వులు పూస్తున్నాయి. విశాలమయిన గ్రౌండులో ఎవరూ లేనందున హుషారుగా అల్లరిచేస్తున్నారు. ఎవరో ఒక అబ్బాయి కుంటుకొంటూ వాళ్ళ ముందునుంచి వెళ్లాడు. కుడికాలు పూర్తిగా వంకరగా ఉంది. కుడిచేయి దానిమీద ఆసరాగా వేసి గబగబా నడుస్తు న్నాడు. చిత్రంగా ఉందతని నడక.

"కుంటి కులాసం"

ఆ గుంపులో ఒకమ్మాయి గట్టిగా అరచింది. అసలే ఆనందోత్సా హాల్లో వున్న సుప్రియ అంతే గట్టిగా "ఇంటికి మోసం" అని అరచింది. ఆటోమేటిక్‌గా ఆపదం నోటినుంచి వచ్చింది. అంతా నవ్వారు.

సుప్రియ అలా అన్నప్పుడు అతడు ఆమెవైపు చూడటం....అతడి కళ్ళల్లో నీళ్లు తిరిగి చెంపల పైకి జారటం ఒకేసారి జరిగాయి. ఇంకా గబ గబా నడుస్తున్నాడు. క్షణం తర్వాత బాధతో నాలిక కరుచుకుంది సుప్రియ. ఫ్రెండ్సు ఇంకా గట్టిగా అరుస్తూనే ఉన్నారు.

"కుంటి కులాసం.... ఇంటికి మోసం"

అతడు తిరిగి తిరిగి చూస్తూ వెళ్ళిపోయాడు. అంతా నవ్వుకున్నాక సుప్రియే అంది.

"మన కాలేజీ కుర్రాడిలాగే వున్నాడే. మనమలా టీజ్ చెయ్యాల్సింది

కాదేమో... ?" అని.

"వాడు మనకన్నా జూనియర్ లేవే. వాడు మనల్నేం చేస్తాడు?" ఒకరు.

"దీనికన్నీ భయాలే" ఇంకొకరు.

"ఒంటరిగా దొరికితే నీ చెయ్యేం పట్టుకోడులే" మరొకరు.

"ఆడదాన్ని టీజ్ చేసే రోజులు చెల్లిపోయాయి. మగాణ్ణే ఆడది టీజ్ చేసే రోజులొచ్చాయి. అందుకే మనమిప్పుడు 'మనుషులు మారాలి' సిన్మాకెళ్తున్నాం" అని యాక్షన్ చేస్తూ మరో అమ్మాయి అనేసరికి అంతా నవ్వుల్లో పడ్డారు.

* * *

మూడో రోజున...

సుప్రియ కాలేజీకి ఆలస్యంగా వెళ్ళింది. క్లాసులు జరగటంలేదు. మీటింగ్ హాల్ నిండా స్టూడెంట్స్, లెక్చరర్లు, ప్రిన్సిపాలూ వున్నారు. మిత్ర బృందమంతా ఓ మూలన వుంది. అందరి మొహాల్లోనూ ఏదో విషాదచ్ఛాయ.

"ఏమైందే?" ఓ మిత్రురాలిని అడిగింది.

"ఎవరో సతీష్‌కుమార్ అట. బి.ఎ. ఫస్టియర్ స్టూడెంట్. నిన్న రాత్రి ఆత్మహత్య చేసుకున్నాట్ట ఇంట్లో. సంతాప సభ పెట్టి సెలవు ప్రకటిస్తారట."

"అయ్యో... పాపం ఎందుకు చనిపోయాడు" అడిగింది సుప్రియ.

"వాళ్ళ నాన్న మంచివాడు కాదట, తనెత్తుపెరిగినా కొట్టేవాడట. అందుకే పోయాడు పాపం".

"ఎవరు చెప్పారే? అదికాదు విషయం... ప్రేమించిన అమ్మాయి మోసగించిందట"

"నీ మొహం.. ఇంటర్నల్స్‌లో మార్కులు తక్కువ వచ్చాయని.."

"కాదే... పినతల్లి సరిగా అన్నం పెట్టకపోయేదట.

"ఆ విషయాలు తెలీదు గాని... బ్రిలియంట్ కమ్ సెన్సిటివ్ అట... ఎవరేమన్నారో?"

"పోనీలేవే... చచ్చినవాడు తిరిగొస్తాడా? ఏదైనా మంచి సిన్మా కెళ్దామా?"

"మంచి అయిడియా.... సభ అయిపోయేలోగా మేం వస్తాం. ఈ లోగా నువ్వు టిక్కెట్లు రిజర్వ్ చేయించు....వెళ్ళు"

"పిచ్చి మొగమా! మనమెందుకే టిక్కెట్లు తీయటం. బికాం సెకండియర్లో రాజేష్‌గాడు లేడూ! వాణ్ణి పిల్చి ఓ నవ్వు పడేస్తే.... తొమ్మిది టిక్కెట్లు వాడే తెస్తాడు"

సుప్రియ మౌనంగా వుంది.

రావిచెట్టు మీది కాకుల్లా వాళ్ళ మాటలు! స్టేజీపై ప్రిన్సిపాల్ మాట్లాడుతున్నాడు. ఇంతలో ఒక లెక్చరర్ ఆ గుంపువైపు వచ్చాడు.

"సుప్రియా... ఆఖర్న నువ్వొక సంతాపగీతం పాడాలి" అని కోరాడు.

"సారీ సర్ మూడ్ బాగాలేదు" అనబోయింది కాని అనలేక పోయింది.

"ఏమేవ్... నీకు మరో లెటరొచ్చింది. చూసుకున్నావా? ఏమిటీ సంగతి... లవ్వా?" అందొక స్నేహితురాలు కవ్వింపుగా. మాట విన్న తక్షణమే అవేవీ పట్టించుకోకుండా జింక పిల్లలా లెటర్ బాక్స్‌వైపు పరి గెత్తింది.

"ఐ లవ్ యూ టింకూ..."

వందల వేలసార్లు అనుకుంటూ వెయిటింగ్ రూంలోకి దూసుకు పోయింది.

"డియర్ నై టింగేల్...

కళా స్రవంతిలో.... నీ కంఠనాళాల మీద కోయిల నర్తించిన వేళ... హృదయ కవాటాలు ఆగి కళ్ళలోకి ఎగిసొచ్చిన ఉద్వేగ రక్తంతో నీ పారాణి పాదాలు అభిషేకం చేయాలన్పించింది. మధ్యలో స్రేలిన టపాకాయ నేనే పేల్చేను. నువ్వు ఉలిక్కి పడితే నేనెంత సేపు నవ్వుకున్నానో?

నీ మెడలో బంగారు పతకాన్ని తగిలిస్తుంటే... నా గుండెను గండెపెండేరంగా మలిచి నీ కాలికి తొడిగాను. శిఖరమ్మీద నువ్వు.... గడ్డిపువ్వునై నేను!

ఇంకా మీరు నన్ను గుర్తించలేదు. ఈ కాలేజీలో చేరిన మొదటి రోజే ఇక్కడి స్టూడెంట్స్ పెట్టిన నిక్‌నేమ్ టింకు. ఆ పేరుని బట్టి నన్ను గుర్తించటంలో ఓడిపోయారు.

దాన్ని వెనుకనించి చదవండి.

కుంటి!!

కాలేజీ గ్రౌండ్స్‌లో మీరూ, మీ మిత్రబృందం అరిచారు గుర్తుందా 'కుంటి కులాసం ఇంటికి మోసం' అని... అవును! వికలమైన జీవితంలో కులాసమెరుగని కుంటివాణ్ణి... ఇంటిల్లిపాదినీ మోసం చేసిపోతున్న మోసగాణ్ణి!!

ఇప్పుడు లోపలున్న ఉత్తరం కోసం... మోసుకొచ్చిన కవరు గుండెను ఎంత తేలిగ్గా చీల్చారో ఆ రోజు... కంగ్రాట్స్ చెప్దామని వస్తున్న నన్ను బ్లేడ్‌లతో చీల్చినట్లు అరిచారు. అందులో మీరే ముఖ్యులు కావటం... నన్నెందుకో బ్రతికించలేకపోయింది.

నేస్తం.... కోయిల గొంతు మాత్రమే అందం...మనసు?? గొప్ప సత్యాన్ని చెప్పారు. నా అసలు పేరు సతీష్ కుమార్. నా కాలికి పోలియో వచ్చి కుంటిగా మారానేమో కాని.... మీ గుండెలకు పోలియో వచ్చి జీవితాన్ని కుంటుపర్చుకోవద్దు.

నా కోసం ఒక్క కన్నీటి చుక్క చాలు.... వుంటాను నేస్తం...

—టింకూ"

ఆమె ఉత్తరం ముగించేలోగా అంధకారం... అప్పుడే ప్రిన్సిపాల్ గారు పిలుస్తున్నారు, పాట పాడాలట అంటూ ఓ ఫ్రెండ్ పరిగెత్తుకొచ్చింది.

సుప్రియ రాకతో హాలంతా నిశ్శబ్దం...

హిమ శిఖరం కదిలివచ్చినట్లు డయాస్ పైకి ఎక్కి నిల్చుంది మౌనంగా...

క్షణాలు.... నిమిషాలు... నిశ్చేష్టులై చూస్తున్నారంతా!

కళ్ళలోంచి కదిలి బుగ్గలపైనించి ధారాపాతమైన కన్నీళ్ళు... జలపాతపు హోరులా ప్రతిధ్వనిస్తూ పడిపోతున్నాయి. ఆమె పాడలేక పోయింది. కాలేజీ రావిచెట్టు మీది కోకిల ఏడ్చినా.... ఆమె లేవలేక పోయింది. ★